శనిత్రయోదశి ఏర్పాట్లపై సమీక్ష

- ఈ నెల 18 న మహాశివరాత్రి, శనిత్రయోదశి పర్వదినం
- లక్షకుపైగా భక్తులు వస్తారని అంచనా



మండపల్లిలో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో ముక్కంటి

కొత్తపేట: మండలంలోని మండపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి క్షేత్రంలో ×మహాశివరాత్రి –శనిత్రయోదశి× పర్వదినం ఏర్పాట్లపై ఆర్డీవో ఎం.ముక్కంటి శనివారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. 20 సంవత్సరాల తరువాత ఈ నెల 18న మహాశివరాత్రి, అమావాస్య ముందు శనివారం–త్రయోదశి (శని త్రయోదశి) కలసి రావడంతో ఈ త్రయోదశి ఎంతో విశిష్టతను సంతరించుకుంది. దాంతో శనిదోష నివారణకు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మండపల్లి శనైశ్చర క్షేత్రానికి లక్షకు పైబడి భక్తులు వస్తారని దేవదాయ–ధర్మదాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులు ఏ విధమైన ఇబ్బందులు పడకుండా సంతృప్తిగా పూజలు, తైలాభిషేకాలు జరిపించి, స్వామి వారి దర్శనం చేసుకుని తిరిగి వెళ్లేలా ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆ ఏర్పాట్లలో భాగంగా ఆర్డీవో ఎం.ముక్కంటి ఆధ్వర్యంలో డీఎస్పీ కేవీ రమణ, దేవదాయ–ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) ఎం.విజయరాజు, ఆర్‌జేసీ ఎం.సురేష్‌బాబుతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు భక్తులు అభిషేక పూజలు నిర్వహించే స్థలాలు, స్నానాల రేవులు, వాహనాల పార్కింగ్ స్థలాలు, మొబైల్ టాయ్‌లెట్స్ ఏర్పాటు చేసే స్థలాలు పరిశీలించారు. అనంతరం ఆలయం వెనుక పూజల ప్రాంగణంలో ఆర్డీవో ముక్కంటి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. గతంలో భక్తుల అసౌకర్యాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవలసి ఉందని ఆర్డీవో సూచించారు. భక్తుల సంఖ్య అంచనాకు అనుగుణంగా మొబైల్ టాయ్‌లెట్స్, నియోజకవర్గంలో పీహెచ్‌సీల ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, 2 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని, అదనంగా జనరేటర్లు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక శానిటేషన్ సిబ్బందిని నియమించాలని, కాలువ రేవుల్లో స్నానాలకు తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రత చర్యలు తీససుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. మండల పరిషత్ నిధులతో ఏటిగట్టు రోడ్డు ఆధునీకరణకు, 2 లక్షలు వాటర్ ప్యాకెట్ల సరఫరాకు తక్షణ చర్యల గురించి చర్చించారు. వాహనాల పార్కింగ్‌కు కోనసీమ పవర్ ప్లాంట్ రోడ్డు, స్థలాన్ని వినియోగించాలని ఆర్డీవో సూచించారు. తొక్కిసలాటకు అవకాశం లేకుండా బారికేడ్లు, అవసరమైన క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. వాటిలో ఒకటి వీఐపీలు, వీవీఐపీలకు, మిగిలిన మూడు సాధారణ భక్తులకు కేటాయించాలని డీసీ విజయరాజు తెలిపారు. అభిషేక పూజలకు ఆలయం వెనుక షెడ్లు, ప్రాంగణం, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ, ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన లోలెవెల్ ఖాళీ స్థలం నిర్దేశించామన్నారు. రావులపాలెం వైపు నుంచి కోనసీమకు, అమలాపురం వైపు నుంచి రావులపాలెం వైపునకు వెళ్లే ఆర్టీసీ, ఇతర వాహనాలను ఈతకోట, పలివెల మీదుగా మళ్లిస్తామని, అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని డీఎస్పీ రమణ తెలిపారు. సమావేశంలో దేవదాయ శాఖ డీఈఓ కేఎస్‌వీడీ ప్రసాద్, డీఈ శ్రీనివాస్, శనైశ్చర దేవస్థానం ఈఓ సింగం రాధ, రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్, ఎస్ఐ వి.మణికుమార్, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, మండపల్లి వీడీసీ కన్వీనర్ సాధు చెంచయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, వివిధ దేవస్థానాల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేశనపల్లిలో జబర్దస్త్ నటుల సందడి



బుల్లి తెర నటులతో స్థానిక నాయకులు

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో శనివారం బుల్లితెర నటులు సందడి చేశారు. బోనం బాబి, నవీన్, వెంకీ మరో ఇద్దరు నటులు కలిసి గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు గెద్దం బాలరమేష్ ఇంట్లో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. వీరిలో బోనం బాబి స్వగ్రామం మండలంలోని గూడపల్లి. యడ్ల నవీన్ శంకరగుప్తం నివాసి. మిగిలిన నటులు దూర ప్రాంతాల నుంచి వచ్చారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం చాలా అందంగా ఉందని పేర్కొన్నారు. స్థానిక నాయకులు గెద్దం తులసీ భాస్కరరావు, యడ్ల పెద్దిరాజు, తాడి సహదేవ్ తదితరులు కూడా పాల్గొన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

వైభవంగా సీతారాముల ఆలయ వార్షికోత్సవం



చిరతపూడిలో వేంచేసిన సీతారాములు

అంబాజీపేట: చిరతపూడిలో వేంచేసిన సీతారామాంజనేయ స్వామి వార్ల ఆలమ 16వ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఎల్ఆర్‌కె మూర్తి, కోశాధికారి ఇళ్ల ఏడుకొండలు పర్యవేక్షణలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో గుత్తుల వెంకటరామ విజయసాగర్, పద్మావతి, చింతపల్లి వీరాంజనేయులు, సోమాలమ్మ దంపతులతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

బూత్ కమిటీలను బలోపేతం చేయాలి

కొత్తపేట: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఆదేశాల మేరకు మండల స్థాయిలో శక్తి కేంద్రాలు, బూత్ కమిటీలు బలోపేతం చేయడం ద్వారా పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర స్వచ్ఛ భారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం పిలుపునిచ్చారు. శనివారం కొత్తపేటలో పాలూరి సత్యానందం స్వగృహం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి అధ్యక్షతన పార్టీ మండల సమావేశం నిర్వహించారు. తొలుత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సత్యానందం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి గొలకోటి వెంకటేశ్వరరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఐనవెల్లి సత్తిబాబు, జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు ప్రసాదరాజు, యువమోర్చా కాకిపాడ జిల్లా ఇన్‌చార్జ్ జేపీ, వివిధ జిల్లా మోర్చాల సభ్యులు పాల్గొన్నారు.

దీన్ దయాళ్‌కు ఘన నివాళి

మామిడికుదురు: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా శనివారం బి.దొడ్డవరంలో ఆయన చిత్రపటానికి బీజేపీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను ప్రస్తుతించారు. రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని పార్టీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వేగి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పసుపులేటి మహలక్ష్మీరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఐ బ్యాంక్ చైర్మన్ నాగబాబు విగ్రహం ఆవిష్కరణ



కె.పెదపూడిలో నాగబాబు విగ్రహాన్ని ఆవిష్కరించిన తాతాజీ

అంబాజీపేట: యర్రా బలరామమూర్తి కోనసీమ ఐ బ్యాంక్ చైర్మన్ యర్రా నాగబాబు విగ్రహాన్ని కె.పెదపూడిలో రాష్ట్ర కాపు నాయకులు కల్వకొలను తాతాజీ శనివారం ఆవిష్కరించారు. తాతాజీ మాట్లాడుతూ ఎందరికో నేత్రాలను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన సేవా తత్పరుడు నాగబాబు భౌతికంగా లేకపోయిన ఆయన చేసిన సేవలు ప్రజల హృదయాల్లో గుర్తుండిపోతాయన్నారు. అంతకు ముందు నాగబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో నాగబాబు కుటుంబ సభ్యులు, స్థానికులు, అభిమానులు, బంధువులు పాల్గొన్నారు.

రామసీత నియామకంపై హర్షం

అంబాజీపేట: విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా కొలుకులూరి రామసీతను నియమిచండంపై అంబాజీపేట మండల సీతారామ శాలివాహన సంఘం వారు శనివారం హర్షం వ్యక్తం చేశారు. సంఘ నాయకులు మాట్లాడుతూ శాలివాహనులను గుర్తించి పాలక మండలి సభ్యురాలిగా నియమించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ర్యాలి శ్రీనివాస్ వడయార్, ఆదుర్తి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన 20 మందిపై కేసు

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లికి చెందిన ఓ వివాహితను ఆస్తి విషయమై ఆమె సోదరుడు 19 మందితో మంది కలసి దాడి చేసి గాయపరిచాడు. దీనిపై శనివారం స్థానిక ఎస్సై ఎస్. నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిరిపల్లికి చెందిన నెల్లి జబేరాను ఆమె సోదరుడు కుసుమ ప్రదీపాల్ ఆస్తి విషయమై 19 మందితో కలసి దాడి చేసి గాయపరిచాడు. దీనిపై బాధితురాలు జబేరా ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సువాసినుల పూజతో మహిళలకు సౌభాగ్యం



అంబాజీపేటలో జరిగిన సువాసినీ నోములో పాల్గొన్న మహిళలు

అంబాజీపేట: మహిళల సౌభాగ్యం పెంపొందించేందుకు సువాసినుల నోము పూజ చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని వేద పండితుడు సుసర్ల బుజ్జి అన్నారు. అంబాజీపేటలో బస్టాండ్ సమీపాన అప్పన నాగేశ్వరరావు, సత్యవతి, సోదరి బచ్చు కృష్ణకుమారి, కుమార్తెలు కోరుకొండ వీవీ నాగసీతామహాలక్ష్మి, కొంజేటి నాగ సూర్య భవానీ, ఊర సుందరిరత్నం, యలమర్తి లక్ష్మి సంధ్యలు సువాసినీ నోము వ్రతోద్యాపన శనివారం నిర్వహించారు. సువాసినీ నోములో పాల్గొన్న 648 మంది ముత్తైదువులకు సాంప్రదాయ బద్ధంగా వాయనాలు అందించారు. శరన్నవరాత్రులు, మాఘ, కార్తీక, వైశాఖ మాసాల్లో సువాసినల పూజలను నిర్వహిస్తారన్నారు. దీని వల్ల మహిళల సౌభాగ్యానికి శ్రీరామ రక్షగా ఉంటుందన్నారు. ఈ పూజకి దూర ప్రాంతాల నుంచి మహిళలు తరలివచ్చారు. అనంతరం భారీ అన్న సమారాధన చేపట్టారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



పుల్లేటికుర్రులో గోపూజ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా మెరుగైన వైద్య సేవలు తీసుకోవాలని సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ పబ్బిసెట్టి రాంబాబులు అన్నారు. పుల్లేటికుర్రులో పంచాయతీ వద్ద రూరల్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ బాలరాజు ప్రారంభించిన ఈ శిబిరంలో అమలాపురం కిమ్స్ ఆస్పత్రి వైద్యులు, పుల్లేటికుర్రు అహ్మద్ హెల్త్‌కేర్ వైద్యులు 272 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కుష్ఠు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, పండ్లను అందించారు. అంతకుముందు చారిటబుల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరించి, గోపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి వీవీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ వీర రవి, ట్రస్ట్ చైర్మన్ యు.సురేష్, కార్యదర్శి వి.మూర్తి, ట్రెజరర్ యు.ప్రసన్న, సభ్యులు పాల్గొన్నారు.

ప్రసన్నకుమార్‌కు సత్కారం

పి.గన్నవరం: నరేంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల అభివృద్ధికి ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సాకా మణికుమారి–ప్రసన్నకుమార్ దంపతులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేరెంట్స్ కమిటీ సభ్యులు అన్నారు. ఇటీవల గురుకుల పాఠశాలలో రూ.4 లక్షలతో జగనన్న లైబ్రరీని ఏర్పాటు చేయడంతో పాటు, రూ.25 వేల విలువైన గ్రైండర్‌ను ప్రసన్నకుమార్ దంపతులు బహూకరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు ప్రసన్నకుమార్‌ను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సికిలే ప్రభాకరరావు, తలపాకుల రవితేజ, వెంకటరమణ, మనోజ్, రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

క్రాస్‌బండ్స్ నిర్మాణానికి అనుమతులు మంజూరు



చింతలపల్లి వద్ద క్రాస్ బండ్ నిర్మాణం చేసే వేపచెట్టు డ్రైన్ ప్రాంతం

రాజోలు: రబీ పంటకు సాగునీటి ఎద్దడి రాకుండా నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా రాజోలు సబ్ డివిజన్ పరిధిలో డ్రైన్స్ ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటికి అడ్డుకట్ట వేసేందుకు క్రాస్‌బండ్స్ నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు మంజూరయ్యాయి. అలాగే పి.గన్నవరం ప్రధాన పంటకాలువలోకి డీజిల్ ఇంజిన్లతో డ్రైన్స్ నీటిని లిఫ్ట్ చేసేందుకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయించింది. క్రాస్ బండ్స్ నిర్మాణానికి సుమారు రూ.45 లక్షలు, పంట కాలువల్లోకి డ్రైన్స్ వాటర్‌ను లిఫ్ట్ చేసేందుకు డీజిల్ ఇంజిన్ల ఏర్పాటుకు రూ.50 లక్షల నిధులు విడుదలయ్యాయి. రాజోలు డ్రైన్స్ శాఖ పరిధిలో వేపచెట్టు డ్రైన్ మీద చింతలపల్లి–మట్టపర్రు వద్ద, పెదతిప్ప, గూడపల్లి డ్రైన్‌పై గూడపల్లి వద్ద, నామనపాలెం డ్రైన్‌పై పాలగుమ్మి, చింతలపల్లి వద్ద, పొన్నమండ నెం–2, పొన్నమండ నెం–3, కూనవరం డ్రైన్‌పై కాత్రేనిపాడు వద్ద, లూటుకుర్రులో ఓడబోది వద్ద, కడలిలో ముళ్లకాలువ వద్ద, ఆదుర్రు డ్రైన్‌పై ఆదుర్రులో, గుడిమూల వద్ద క్రాస్ బండ్‌లు నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే అంతర్వేది వద్ద సముద్రం నుంచి బ్యాక్‌వాటర్ రాకుండా నివారించేందుకు అంతర్వేది వద్ద ఒక క్రాస్‌బండ్ నిర్మాణం చేయనున్నారు. అలాగే పి.గన్నవరం ప్రధాన పంటకాలువలో డ్రైన్స్ నీటిని తోడేందుకు రూ.28 లక్షలు, తాటిపాక సెక్షన్ పరిధిలో కడలి పంటకాలువలోకి నీటిని తోడేందుకు రూ.16 లక్షలు నిధులు కేటాయించారు. రాజోలు డ్రైన్స్ పరిధిలో క్రాస్‌బండ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేస్తామని డ్రైన్స్ శాఖ డీఈఈ ఆర్.నాగార్జునరావు తెలిపారు. రబీ పంటకు సాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపడతామన్నారు.

లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం



రాజోలులో మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి ప్రమీలారాణి

రాజోలు: మెగా లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని రాజోలు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి అన్నారు. శనివారం రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్‌కుమార్‌లతో కూడిన రెండు బెంచ్‌ల ద్వారా మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ప్రీలిటిగేషన్ కేసులతో పాటు, బ్యాంక్, ప్రైవేటు కంపెనీలు, క్రిమినల్, సివిల్ కేసులను పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి మాట్లాడుతూ త్వరితగతిన కేసులు పరిష్కరించేందుకు లోక్ అదాలత్ వేదికగా నిలుస్తుందన్నారు. రాజీయే రాజమార్గం సూక్తితో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని కేసులకు అదాలత్ ద్వారా విముక్తి లభిస్తుందన్నారు. లోక్ అదాలత్ సభ్యులు ఎడ్విన్‌మైఖేల్, గంటి రవికుమార్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదే ప్రామాణికం



మాచవరంలో ఈ–పంట నమోదుపై రైతులను తనిఖీ చేస్తున్న ఏడీ వినయ్‌చంద్

అంబాజీపేట: రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ఈ–పంట నమోదే ప్రామాణికంగా నిర్ధారించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ జి.వినయ్‌చంద్ అన్నారు. మాచవరం, ముక్కామల గ్రామాల్లో ఈ–పంట నమోదును శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అంబాజీపేట, అల్లవరం, ముమ్మిడివరం గ్రామాల్లో ఈ–పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేయనున్నామన్నారు. అనంతరం వీటి వివరాలను కమిషనర్‌కు నివేదిస్తామన్నారు. సాగు చేసే ప్రతి రైతు ఈ–కేవైసీలో నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు రైతు భరోసా, పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, ధాన్యం అమ్మకాలకు అర్హుడవుతాడన్నారు. కౌలుదారుడైతే పంట సాగు హక్కు పత్రం వ్యవసాయ సిబ్బందికి అందించి ఈ–పంట నమోదు చేసుకోవాలన్నారు. రైతుల నుంచి వారి ఖాతా నంబర్లు, పేరు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి కాకి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 1.76 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారన్నారు. 1.55 ఎకరాల్లో క్రాప్ నమోదు చేశామన్నారు. ఈ–కేవైసీ 50 శాతం పూర్తయిందన్నారు. ఈ–క్రాప్, ఈ–కేవైసీ నమోదుకు రైతులు సహకరించాలన్నారు. ఈ నెల 20లోగా నమోదు చేయించుకోవాలని ఆయన రైతులను కోరారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు, ఏఓలు మురళీధర్, సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏఈఓ డి.దుర్గారావు, వీఆర్వోలు రమేష్, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

వర్కింగ్ మోడల్స్‌కు పెద్దపీట వేయాలి



జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో రవిసాగర్ తదితరులు

అంబాజీపేట: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో వర్కింగ్ మోడల్స్‌కు పెద్దపీట వేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ పిలుపునిచ్చారు. ఈ నెల 16, 17 తేదీల్లో అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం పాఠశాల హెచ్‌ఎం, డీసీఈబీ సెక్రటరీ బీర హనుమంతురావు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకటసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేసేందుకు 16 కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. కమిటీల వారీగా ఎంపికైన వారి బాధ్యతలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోస్టర్స్‌ను డీఈవో రవిసాగర్, డీవైఈవో షాలెంరాజు, డీఎస్‌వో సుబ్రహ్మణ్యం తదితరుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. సమావేశంలో గెజిటెడ్ హెచ్‌ఎం అసోసియేషన్ అమలాపురం డివిజన్ అధ్యక్షుడు పెచ్చెట్టి శ్రీనివాస్, సెక్రటరీ నిమ్మకాయల గణేశ్వరరావు, హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా ట్రెజరర్ పి.పల్లయ్యశర్మ, చింతనలంక హెచ్‌ఎం పీవీ రవిప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అసోసియేషన్ నేత ఉండ్రు ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.



గజాల లెక్కనే పరిహారం అందించాలి



అధికారుల ఎదుట నిరసన తెలుపుతున్న పాశర్లపూడిబాడవ వాసులు

మామిడికుదురు: 216వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ కోసం తీసుకుంటున్న భూములకు గజాల లెక్కనే పరిహారం అందించాలని పాశర్లపూడి బాడవ గ్రామస్తులు శనివారం డిమాండ్ చేశారు. కొందరికి సెంట్ల లెక్కన మరికొందరికి గజాల లెక్కన పరిహారం ఇవ్వడం ఏంటంటూ జాతీయ రహదారుల శాఖ అధికారులను నిలదీశారు. భూములను స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. అందరికీ పరిహారం చెల్లించిన తర్వాతే భూములు స్వాధీనం చేస్తామని చెప్పడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో గంధం స్వామినాయుడు, బొక్కా రామకృష్ణ, వర్ధనపు లక్ష్మీకుమారి, గంధం లక్ష్మణరావు, కె.మంగతాయారు, గుడిమెళ్లంక రంగారావు, గంధం మాణిక్యం, వాకపల్లి శ్రీను పాల్గొన్నారు.

17న లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఈ నెల 17న ఆర్జిత సేవగా శ్రీస్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శనివారం తెలిపారు. భక్తులు ఆలయం వద్ద కౌంటర్‌లో గాని, ఏపీ టెంపుల్స్ వెబ్‌సైట్‌లో గాని ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని ఆయన అన్నారు.

భారత రాజ్యాంగ పీఠిక అందజేత



నూతన దంపతులకు రాజ్యాంగ పీఠిక అందజేస్తున్న సత్య

మామిడికుదురు: మహాత్మ జ్యోతీరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానంతో సాంఘిక వివాహం చేసుకునే వారికి బీఎస్పీ తరఫున రాజ్యాంగ పీఠిక అందిస్తామని ఆ పార్టీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చింతా సత్య పేర్కొన్నారు. పాశర్లపూడిలంకలో శనివారం సాంఘిక వివాహం చేసుకున్న పాలమూరి అనిల్‌కుమార్, దివ్యలకు రాజ్యాంగ పీఠికను అందించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ కాండ్రేగుల నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు కోలా త్రిమూర్తులు, బుడితి దయామహేష్, తాడి రాంబాబు, తాడి రమేష్, నిశాంత్, నెల్లి బాలు, నిశాంత్, నాని, ములపర్తి చందు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం

అంబాజీపేట: మత్తు పదార్థాలకు బానిసై విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై ఎ.చైతన్యకుమార్ అన్నారు. అంబాజీపేట ఎస్‌ఎస్‌ఎం విద్యా సంస్థల్లో మత్తు పదార్థాల వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా గంజాయితో పాటు మత్తు పదార్థాలు తాగినట్లు సమాచారం వస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పోలీస్ రికార్డుల్లోకి ఎక్కుతారన్నారు. దాంతో వారి జీవితం అంధకారం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎం.సాయిప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.రాధామణిలు పాల్గొన్నారు.

